క్లుప్తంగా

కొర్ర విత్తనాల పంపిణీ

బనగానపల్లెరూరల్: మండలంలోని యాగంటి పల్లె రైతుభరోసా కేంద్రంలో మీరాపురం, యాగంటిపల్లె రైతులకు కొత్త రకం కొర్ర విత్తనాలను క్షేత్రస్థాయి ప్రదర్శన నిమిత్తం డాట్ కోఆర్డినేటర్ డాక్టర్ సరళమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సరళమ్మ మాట్లాడుతూ ఈ గ్రామాల భూములు కొర్ర పంట సాగుకు అనుకులమని, ఇక్కడి భూ పరిస్థితులకు అనుగుణంగా కొత్త రకం కొర్ర విత్తనాన్ని క్షేత్రస్థాయిలో ప్రదర్శన నిమిత్తం ఎంపిక చేసిన రైతులకు మాత్రమే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిఆర్సి అగ్రికల్చర్ ఆఫీసర్ ప్రభావతమ్మ, మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయశాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్,ఏఈఓ ఓబులేసు తదితర రైతులు పాల్గొన్నారు.

ముఖర్జీ ఆశయ సాధనకు కృషి

డోన్ టౌన్ : జన సంఘ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ ఆశయ సాధనకు కృషి చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు హేమసుందర్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డే మహారాజ్ పిలుపునిచ్చారు. ముఖర్జీ వర్ధంతి(బలిదాన్)పురస్కరించుకొని శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు.

పశు బీమాను వినియోగించుకోండి



సదస్సులో మాట్లాడుతున్న ఎంవీ వరప్రసాద్

సంజామల: పాడి రైతులు వైఎస్సార్ పశు బీమాను వినియోగించుకోవాలని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎంవీ వరప్రసాద్ సూచించారు. ప్రాంతీయ పశువైద్యశాలలో పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ మోహన్ రావు అధ్వర్యంలో శుక్రవారం పశు బీమాపై పాడి రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ప్రమాద వశాత్తు పశువులు చనిపోతే బీమా వర్తిస్తుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ శివానంద, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి దివ్యాంగురాలు

డోన్ టౌన్ : అత్తారింటి వేధింపులు భరించలేక దివ్యాంగురాలు హేమావతి పట్టణంలోని హోసన్నా వృద్ధాశ్రమానికి ఆశ్రయించినట్లు ఆశ్రమ నిర్వాహకుడు జాన్‌ప్రభాకర్ శుక్రవారం తెలిపారు. ధర్మారం గ్రామానికి చెందిన ఈమెను పదేళ్ల క్రితం కృష్ణగిరి మండలం పెదొడ్డి గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. అయితే దివ్యాంగురాలు కావడంతో అత్తవారి ఇంట్లో వేధింపులు ఎక్కువయ్యాయి. దీంతో భరించలేక ఇక్కడికి వచ్చిందని జాన్ ప్రభాకర్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

కోవెలకుంట్ల: మండలంలోని గుళ్లదూర్తికి చెందిన ఓ వ్యక్తిపై శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. ఎస్ఐ సమాచారం మేరకు ఎర్రమల అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన రఘునాథరెడ్డి రేషన్ బియ్యం సరఫరాలో చోటుచేసుకున్న వాగ్వాదంలో కులం పేరుతో దూషించాడు. దీంతో ఎర్రమల పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు రఘునాథరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అవుకు: పట్టణ సమీపంలోని ఉప్పలపాడు ఆర్చీ వద్ద శుక్రవారం ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్నాయి. 108 అంబులెన్స్ ఈఎంటీ జనార్దన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు బనగానపల్లె మండలం కైప గ్రామానికి చెందిన మధుకృష్ణ కొలిమిగుండ్ల మండలం బెలుం గ్రామం నుంచి వస్తున్నాడు. కొలిమిగుండ్ల మండలంలో సాయిబాబా ఆలయం పూజారి సోమసుందర్ కొలిమిగుండ్ల వైపు వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో ఉప్పలపాడు ఆర్చీ వద్ద రెండు బైక్‌లు ఎదురెదురగా ఢీకొనడంతో మధుకృష్ణకు తీవ్రంగా గాయాలయ్యాయి. సోమసుందర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పైలట్ వెంకటేశ్వర్లు సాయంతో బనగానపల్లె ప్రభుత్వ సుపత్రిలో చేర్పించామని ఈఎంటీ తెలిపారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు

బేతంచెర్ల: మండల పరిధిలోని సీతారామాపురంలో బెల్టుషాపు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన గద్దల మాదన్న మద్యం విక్రయిస్తుండగా 11 మద్యం బాటిల్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలను సద్వినియోగం చేసుకోండి

అవుకు: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డాక్టర్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పిక్కళ్లపల్లితాండా, జూనూతల గ్రామాల్లో ఇళ్లవద్దకే వెళ్లి వైద్య సేవలను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ రక్తపోటు, డయాబెటిస్, క్యాన్సర్, గుండె, గర్భిణులు, బాలింతలకు, చిన్న పిల్లలకు, మంచానికే పరిమితమైన వృద్ధులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్, సిహెచ్ఓ శ్రీలేఖ, ఆరోగ్య కార్యకర్త జ్యోష్ణ పాల్గొన్నారు.

అమ్మకు అనుకూలంగా పౌష్టికాహారం!

- గర్భిణులు, బాలింతల ఇళ్లకే పంపిణీకి ప్రభుత్వం నిర్ణయం
- నెలలో రెండు విడతల్లో పోషక ఆహారం సరుకులు అందజేత
- జూలై 1 నుంచి అమలు కానున్న టేక్ హోం రేషన్



గర్భిణులు, బాలింతలకు ఇంటికే పౌష్టకాహారం పంపిణీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం(ఫైల్)

బనగానపల్లెరూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధితోపాటు మాతాశిశు సంరక్షణకు పెద్దపీట వేస్తుంది. అమ్మఒడి నుంచి ఇంటి పట్టా పక్కా గృహం వరకు చేయూత, ఆసర తదితర పథకాలను మహిళలకు అందజేస్తూ ప్రోత్సహిస్తుంది. మాత శిశు సంరక్షణకు, స్త్రీలలో రక్తహీనత నివారణకు వైఎస్సార్ సంపూర్ణపోషణ, జగనన్న కిట్ల రూపంలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేస్తున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రూచికరమైన ఆహారాన్ని వడ్డించి గర్భిణులు, బాలింతల ఆరోగ్య సంరక్షణకు చేయూతనిస్తుంది. కొందరికి అంగన్‌వాడీ కేంద్రాలు దూరంగా ఉండడం, ఆరోగ్య సమస్యల మూలంగా రాకపోవడంతో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందడం లేదు. విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. జూలై 1 నుంచి పౌష్టిహారాన్ని ఇంటికే ఇవ్వాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం అంగన్‌వాడీ ప్రాజెక్టులకు ఆదేశాలు జారీ చేసింది కూడా. అంగన్‌వాడీ కేంద్రాల్లో వండిన ఆహారానికి బదులుగా టేక్ హోం రేషన్ పేరుతో ఇంటికే పౌష్టికాహార సరుకులు అందజేయాలని నిర్ణయించింది. దీంతో గర్భిణులు, బాలింతలు సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

బనగానపల్లె ప్రాజెక్టులో 4,404 మందికి సరుకులు

బనగానపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోకి బనగానపల్లె, అవుకు, కోవెంకుంట్ల సంజామల, కోవెలకుంట్ల మండలాలు వస్తాయి. మొత్తం 274 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. గర్భిణులు 2,322, బాలింతలు 2,082 మంది నమోదు అయ్యారు. వీరందరికీ జూలై నుంచి ఇంటికే పౌష్టికాహారం అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది పంపిణీ చేయనున్నారు.

జూలై ఒకటో తేది నుంచి అమలు



అంగన్‌వాడీ కేంద్రాల నుంచి అందించే పోషకాహారం జూలై ఒకటో తేదీ నుంచి సరకుల రూపంలో లబ్ధిదారుల ఇళ్లకే పంపిణీ చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ప్రతి నెలా ఒకటో తేది నుంచి ఐదో తేదీలోగ మొదటి విడత విడతగా బియ్యం, కందిపప్పు, నూనె, కోడిగుడ్లు, పాలు, రాగిపిండి, అటుకులు, బెల్లం, చిక్కిలు ఎండు ఖర్జూర అందిస్తాం. రెండో విడతగా 16,17వ తేదీల్లో కోడిగుడ్లు, పాలు అందజేస్తాం.

– ఉమామహేశ్వరమ్మ, సీడీపీఓ, బనగానపల్లె ప్రాజెక్టు

బనగానపల్లె ప్రాజెక్టు పరిధిలో లబ్ధిదారులు వివరాలు

మండలం	గర్భిణులు	బాలింతలు
బనగానపల్లె	871	773
అవుకు	375	330
కోవెలకుంట్ల	386	408
సంజామల	259	217
కొలిమిగుండ్ల	431	354

సంపూర్ణపోషణ కిట్లు ఇలా..

అటుకులు	కిలో
రాగి పండి	కిలో
జొన్న పిండి	కిలో
కంది పప్పు	కిలో
బియ్యం	3 కిలోలు
బెల్లం	250 గ్రాములు
చిక్కిలు	250 గ్రాములు
ఎండుఖర్జూరం	250 గ్రాములు
నూనె	500 గ్రాములు
గుడ్లు	25
పాలు	5 లీటర్లు

ప్రభుత్వ నిర్ణయం బాగుంది



ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో వండిన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. కేంద్రాలకు దూరంగా ఉన్నవారికి రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. ఒక్కోసారి అంగన్‌వాడీ కేంద్రాలకు రాలేకపోతున్నాం. సమస్యను అధికారులు గుర్తించడం సంతోషకరం. ఇంటి వద్దకే సరుకులు అందజేయాలనే ప్రభుత్వ నిర్ణయం చాలా బాగుంది. గర్భిణులు, బాలింతల అర్థం చేసుకున్న అధికారులకు కృతజ్ఞతలు.

– లలితాదేవి, బాలింత, బనగానపల్లె

ఇష్టం మేరకు వంట చేసుకోవచ్చు



పౌష్టికాహారం సరుకులను ఇళ్లకే పంపిణీ చేయడం చాలా మంచిది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో వండిన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. ఒక్కోసారి ఆకలి లేనప్పుడు భోజనం చేయలేని పరిస్థితి. అలాంటప్పుడు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి కూడా ప్రయోజనం ఉండదు. సరుకులు ఇళ్లకే అందజేస్తే ఇష్టం మేరకు వంట చేసుకుంటాం. ప్రభుత్వం అలోచన అభినందనీయం.

– రాజేశ్వరి, గర్భిణి, పలుకూరు

రెండు రైళ్లు రద్దు

డోన్ టౌన్ : గుంటూరు డివిజన్‌లో జరుగుతున్న రైల్వే పనుల కారణంగా ఉన్నతాధికారులు రెండు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు డోన్ స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి తెలిపారు. గుంటూరు నుంచి కాచిగూడ (17251)ఈ నెల 27 నుంచి జూలై 5వ తేదీ వరకు, కాచిగూడ నుంచి గుంటూరు ట్రైన్ (17252)ఈ నెల 28 నుంచి జూలై 6వ తేదీ రద్దు అయినట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బేతంచెర్ల: అర్హతనే ప్రమాణికంగా సంక్షేమ పథకాలు చేయడమే కాకుండా వారి సమస్యల పరిష్కారం కోసం జగనన్న సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, సచివాలయ సిబ్బంది, కౌన్సిలర్లు, సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష లాంచింగ్ కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, వార్డు కౌన్సిలర్స్ మధు, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, నిరంజన్ పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్యాపిలి: కౌమార దశలో ఉన్న బాలబాలికలు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్‌ను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారిణి వాణిశ్రీ సూచించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆమె విద్యార్థినులకు అవగాహన కల్పించారు. 10 నుంచి 19 సంవత్సరాల వయసులో బాలికల్లో శారీరకంగా మార్పులు వస్తాయన్నారు. బాలికలు ఆందోళనకు గురవుతారని, ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం బాలికలకు, ప్రతి శనివారం బాలురకు స్థానిక పీహెచ్‌సీలో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు ప్రభుత్వం ఫ్రెండ్లీ హెల్త్ క్లినిక్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ రాఘవేంద్ర గౌడ్, ఎంఎల్‌హెచ్‌పీలు శ్రీజ, మల్లేశ్వరి, ఆశా వర్కర్లు నీలమ్మ, మాలేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

బేతంచెర్ల: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. మండలంలోని ఎం.పేండేకల్లు, రేపల్లె గ్రామాల్లో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ వెంగన్న, సర్పంచ్ ముచ్చు రామక్క, ఎంపీటీసీ మహేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి నాగప్రసాద్‌తో కలిసి ఎంపీపీ గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఎంపీపీ ఇంటింటికీ వెళ్లి అవ్వ, తాత బాగున్నారా... ఒకటవ తేదీ ఫించన్ వస్తుందా... అంటూ ఆరా తీశారు. అదేవిధంగా వైఎస్సార్ ఆసరా, చేయూత వస్తుందా అక్క అంటూ ఎంపీపీ ఇంటింటికీ వెళ్లి పలుకరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కుంటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎంపీపీ అందజేశారు. డ్రైనేజీ కాల్వలు, సీసీ రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, ఇళ్లు మంజూరు చేయాలని, విద్యుత్ తీగలు ప్రమాదం కరంగా ఉన్నాయని స్థానికులు ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిన ఎంపీపీ రానున్న రోజుల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వడమే కాకుండా గోరుకల్లు రిజర్వాయర్ ద్వార శుద్ధమైన నీరు అందజేస్తామన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైఎస్సార్‌సీపీని ఆదరించాలన్నారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ సభ్యుడు మూర్తుజావలీ, స్టేట్ మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఖాజా హుసేన్, వాల్మీకి ఫెడరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మురళీకృష్ణ, సింగిల్ విండో అధ్యక్షుడు నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు బాబుల్‌రెడ్డి, గోపాల్ రెడ్డి,మహేశ్వర్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, పరమేష్, నాగరాజు, ఆర్వేటి శేఖరయ్య, నాగేశ్వరావు, దస్తగిరి, తిరుమలేశ్వర్‌రెడ్డి, ఎద్దులన్న, రామనాయుడు, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత

- కులమతాల పార్టీలకు అతీతంగా ప్రభుత్వ ఫలాలు
- ప్రజల ఆశిస్సులే జగనన్న బలం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

సంజామల: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమానంగా ప్రాధాన్యతిస్తూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. మండలం నొస్సం గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ మలికిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి గుండం సూర్య ప్రకాష్ రెడ్డి, ఎంపీపీ పోచా రమాదేవి, నాయకులు మక్కిరెడ్డి రఘురాం రెడ్డి, మల్కిరెడ్డి రామకృష్ణారెడ్డి, మలికరెడ్డి శివరామిరెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, సర్పంచ్ కంబయ్య, తహసీల్దార్ మల్లికార్జునరావు, ఎంపీడీఓ నాగ కుమార్ మండల వ్యవసాయ అధికారి సుధాకర్ రెడ్డి, ఏపీఓ ప్రకాష్ రావు, ఏపీఎం శేఖర్ కలిసి ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు తీరును ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించడంతోపాటు ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అర్హత ఉండి కూడా సంక్షేమ పథకాలు అందని వ్యక్తులు తమ దృష్టికి తసుకొస్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఏ ఒక్క అర్హుడికి అన్యాయం జరగకూడదని ఉద్దేశంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల వివరాల బ్రోచర్‌ను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కోవెలకుంట్ల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ బీవీ నాగార్జున రెడ్డి, వైస్ ఎంపీపీ చిన్నబాబు, నాయకులు అనిపి నాగిరెడ్డి, సంతోష్, శ్రీనివాసులు, సుధాకర్ రెడ్డి వెంకటేశ్వర రెడ్డి, బైరెడ్డి భాస్కర్ రెడ్డి,శివశంకర్, సుబ్బయ్య,రాజశేఖర్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కుల మతాలు, పార్టీలకు అతీతంగా అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు వర్తింప చేస్తుందని ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించిన అనంతరం ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే ప్రసంగించారు. జగనన్న పాదయాత్రలో ప్రజల కష్టాలు నష్టాలు తెలుసుకుని అధికారంలోకి రాగానే అర్హత ప్రామాణికంగా నవరత్న పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చుతున్నారని గుర్తు చేశారు. కేవలం నొస్సం సచివాలయ సంబంధించి ప్రజలకు ప్రత్యక్షంగా నాలుగేళ్లలో దాదాపు రూ.16.30కోట్లు అందిందని వివరించారు. ప్రజల ఆశిస్సులే జగనన్న బలమని, ప్రజల వద్దకే పాలన సాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని దీవించాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు.

ఎరువులు, విత్తనాల అమ్మకాలు నిలిపివేత



విత్తనాల ప్యాకెట్‌లపై వివరాలను పరిశీలిస్తున్న ఏడీఏ ఆంజనేయ

ప్యాపిలి: పట్టణంలోని పలు ఫర్టిలైజర్స్ దుకాణాలను ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ, ప్యాపిలి వ్యవసాయాధికారి రాజేశ్ శుక్రవారం తనిఖీ చేశారు. పలు దుకాణాల్లో రికార్డులు సక్రమంగా లేనట్లు వారు గుర్తించారు. ఈ మేరకు రూ. 8,63,700 విలువ గల ఎరువులు, రూ. 17,243 విలువ గల విత్తనాల అమ్మకాలను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. నిలువ సరుకు, రికార్డుల వివరాల్లో పొంతన లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎరువుల దుకాణాల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు ప్రతి కొనుగోలుపై తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. స్టాక్ వివరాలు, ఎమ్మార్పీ తదితర వివరాలను నోటీస్ బోర్డుపై ప్రదర్శించాలన్నారు.

గ్రామీణ క్రీడాకారులు ప్రతిభను చాటుకోవాలి



ఒలంపిక్ డే రన్ ర్యాలీలో పాల్గొన్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె: ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని, గ్రామీణ క్రీడాకారులు ప్రతిభను చాటుకోవాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుల రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం కోవెలకుంట్ల జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం, క్రీడాకారుల ఆధ్వర్యంలో ఒలంపిక్ డేరన్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కాటసాని ఓబులరెడ్డి పాల్గొని క్రీడా జ్యోతిని ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒలంపిక్ డే రన్ సందర్భంగా దేశ వ్యాప్తంగా క్రీడాకారులో క్రీడా స్ఫూర్తిని నింపడానికి ర్యాలీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐ తిమ్మారెడ్డి, నందివర్గం ఎస్ఐ రామాంజనేయరెడ్డి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు అత్తార్‌జాహేద్‌హుస్సేన్, న్యాయవాది మాదవరెడ్డి, అవుకు ఎంఈఓ శ్రీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న అధికారులు

డోన్ టౌన్: మండల పరిధిలోని చిన్నమల్కాపురం గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం పంచాయితీరాజ్ డీఈ రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఈ నారాయణ పరిశీలించారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ. 2లక్షలతో సీసీ రోడ్డు, డ్రైనేజ్ నిర్మిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుత్తెదారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు తవిసికొండ రామలక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

బెస్తల అభివృద్ధికి సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

అవుకు: ఐకమత్యంతోనే అభివృద్ధి సాధ్యమని, ఆ దిశగా బెస్తలు ఐక్యత చాటుకోవాలని వైఎస్సార్‌సీపీ నేత చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి సూచించారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు చల్లా విజయభాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చల్లా అమర్‌నాథ్ రెడ్డి, ఉపసర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డిలతో కలిసి అవుకు చెరువు కట్ట సమీపంలో బెస్త సామాజికవర్గ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవుకు మత్స్యకారుల జీవన అభివృద్ధికి అవుకు చెరువు ఎంతోగానో ఉపయోగపడుతున్నదన్నారు. దివంగత నేత చల్లా రామకృష్ణారెడ్డి బెస్తలకు చేసిన సేవలను గుర్తు చేసిన ఆయన తన తండ్రి అడుగుజాడల్లోనే ముందుకు సాగుతున్నామని, ప్రజలు తమవంతు సహకారం అందజేయాలని కోరారు. మత్స్యకారుల కుటుంబాలకు చల్లా కుటుంబం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఏ సమస్యనైనా తమ దృష్టికి తేవాలని, అంకితభావంతో పరిష్కరించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, శివారెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయండి



అన్నవరం ఆర్బీకేను పరిశీలిస్తున్న పీఆర్ ఈఈ రామకృష్ణారెడ్డి

అవుకు: మండల పరిధిలో జరుగుతున్న ప్రభుత్వ భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని నంద్యాల జిల్లా పీఆర్ ఈఈ రామకృష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని అన్నవరం, గుండ్లశింగవరం గ్రామాలను డీఈఈ నాగశ్రీనివాసులుతో కలిసి సందర్శించారు. ఆయా గ్రామాల్లో నిర్మిస్తున్న గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, హెల్త్ క్లీనిక్ సెంటర్ భవన నిర్మాణాలను పరిశీలించారు. వీలైనంత త్వరగా భవన నిర్మాణాలను పూర్తి చేసి ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా ఆయా ప్రజలకు అన్ని సేవలను అందించటానికి కృషి చేయాలని అధికారులకు పీఆర్ ఈఈ సూచించారు. అలాగే మండలంలోని ఎన్ని ప్రభుత్వ భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి, ఎంతమేరా పనులు పూర్తయ్యాయి అనే విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఈ గౌస్, ఇంజినీర్ అసిస్టెంట్‌లు నాగార్జున, ప్రవీణ్ పాల్గొన్నారు.

జూలై 15 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలి

- ఒక్కో లబ్ధిదారునికి రూ. 20 వేలు అడ్వాన్స్
- పక్కాగృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలి
- హౌసింగ్ పీడీ భాస్కర్‌నాయుడు



గృహ నిర్మాణాలను పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ భాస్కర్‌నాయుడు

కోవెలకుంట్ల: జిల్లాలోని ఆయా జగనన్న కాలనీలు, కుడా పథకం కింద చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను వచ్చే నెల 15వ తేదీకంతా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ భాస్కర్ నాయుడు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్ డీఈ కృష్ణారెడ్డి, తహసీల్దార్ పుష్పకుమారి, ఎంపీడీఓ రాధిక, హౌసింగ్ ఏఈ సుదర్శన్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేస్‌మెంట్ దశలో ఆగిన పక్కాగృహాల నిర్మాణాలను తిరిగి ప్రారంభించేందుకు ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారురాలికి రూ. 20 వేలు అడ్వాన్స్ రూపంలో చెల్లించిందన్నారు. ఆయా లబ్ధిదారుల ఖాతాల్లో ఇప్పటికే నగదు జమ అయిందన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వం మూడు విడతల్లో రూ. 1.80 లక్షల బిల్లులు చెల్లిస్తోందన్నారు. రాయితీపై ఇనుప కడ్డీలు, సిమెంట్, ఇంటి నిర్మాణ సామగ్రి, ఉచితంగా 20 టన్నుల ఇసుక సరఫరా చేస్తోందన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి సొంతింటి కల నెరవేర్చుకోవాలని సూచించారు. జగనన్న కాలనీల్లో ఇప్పటి వరకు పక్కాగృహాలు మంజూరై ఇళ్ల నిర్మాణాలు చేపట్టని లబ్ధిదారుల గృహాలను రద్దు చేసి పట్టాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి



శింగనపల్లె సమీపంలో పైప్‌లైన్‌ను పరిశీలిస్తున్న మనోహర్

అవుకు: ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని సరఫరా చేయాలని, నీరు ఏ మాత్రం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్ మనోహర్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల పరిధిలోని మెట్టుపల్లె, రామవరం, ఓబుళాపురం, చెన్నంపల్లె, శివవరం, శింగనపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న జల్‌జీవన్ మిషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినెల క్రమం తప్పకుండా 2వ తేదీ, 17వ తేదీన వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి, నీటి సామర్థ్యానికి తగినట్టు క్లోరినేషన్ చేయాలని సూచించారు. అలాగే పైప్‌లైన్ లీకేజీలపై దృష్టి పెట్టాలని, ఎక్కడైనా ఉంటే వాటిని సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరిముల్లా తదితర సిబ్బంది పాల్గొన్నారు.